క్లుప్తంగా

అగస్త్యేశ్వరుడికి భస్మాభిషేకం



భస్మార్చనలో అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా అగస్త్యేశ్వరునికి ఘనంగా భస్మ హారతి ఇచ్చారు. వేకువజామున స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరుని మూలవిరాట్‌ను వేదపండితులు భస్మంతో అభిషేకించారు. అనంతరం హారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పరమేశ్వరున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కలశాభిషేకం



కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

మైదుకూరు : మైదుకూరులోని శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాస ముగింపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 101 కలశాలతో స్వామివారికి అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గంగా పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ మూర్తుల వద్ద కలశాలను ఉంచి గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలను గ్రామంలో ఊరేగించారు. భీమేశ్వర స్వామి మూలవిరాట్‌కు కళశాలతో భక్తులు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ప్రసాద్‌రావు, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్లు బెల్లం సుబ్బరాయుడు, శింగయ్యగారి రామ్మోహన్, సూరమ్మగారి సుబ్బరాయుడు, బెల్లం బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



అగ్ని గుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

అట్లూరు: మండల పరిధిలోని కొండూరులో వెలసిన వీరభద్రస్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముందుగా వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించి, భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. కర్ణాటక నుంచి వచ్చిన వేదపండితులు కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారిని ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నివాళి

ఖాజీపేట (చాపాడు): మండల పరిధిలోని పత్తూరు పంచాయతీ నాగపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తలుపుల అయ్యవార్ (65) అనారోగ్యంతో చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎసార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం అయ్యవార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.


నందూరి శ్రీనివాస్‌కు సేవా పురస్కారం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న హనుమంతరావు

గోపవరం : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ నందూరి శ్రీనివాస్ కవయిత్రి మొల్ల ఆధ్యాత్మిక సేవా పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు నందూరి శ్రీనివాస్‌కు మొల్ల జ్ఞాపికను బహూకరించి శాలువాతో సత్కరించారు. మొల్ల సాహితీ పీఠం వివరాలను, హనుమంతరావు చేస్తున్న కృషిని శ్రీనివాస్ అభినందించారు.

ఆలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



ఆలయ ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న గుడి బడి సేవా సంస్థ ప్రతినిధులు

దువ్వూరు : దువ్వూరులోని వీరాంజనేయ స్వామి, గంగమ్మ ఆలయాల్లో ఆదివారం గుడి బడి సేవా సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. సేవా సంస్థ ప్రొద్దుటూరు విభాగం ప్రతినిధులు సాలూరు మాధవీలత, డాక్టర్ మూలె రామమునిరెడ్డి నేతృత్వంలో ఆలయాల పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఆలయాలపైన, గోపురాలు శుభ్రం చేసి కంపచెట్లను తొలగించారు.

కలివికోడి.. ఎక్కడున్నావ్!

కలివి కోడి అంటే జిల్లా వాసులకు పరిచయం చేయనక్కరలేదు. సిద్దవటం రేంజ్ పరిధిలోని అట్లూరు మండలంలోని కొండూరు బీట్ పరిధిలో లంకమల్ల అభయారణ్యం ప్రాంతంలో నాలుగు దశాబ్దాల క్రితం కలివి కోడి కథ మొదలైంది. అప్పటి నుంచి అటవీశాఖ, ప్రత్యేక పరిశోధన సంస్థ ప్రతినిధులు ఈ పక్షి ఉనికి కనుగొనేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

- దశాబ్దాలుగా అన్వేషణ
- కనిపించని పక్షి జాడ
- ఆచూకి కోసం కెమెరాలు ఏర్పాటు



కలివికోడి ఆవాస ప్రాంతంలో కెమెరాలు అమర్చుతున్న అధికారులు

అట్లూరు: అంతరించిపోతున్న అరుదైన పక్షి జాతుల్లో కలివికోడి ఒకటి. ఎప్పుడో 1870లో కనిపించిన ఈ పక్షి ఆ తరువాత క్రమంగా అంతరించిపోయినట్టు పర్యావరణ ప్రియులు భావించారు. కానీ దాదాపు శతాబ్దం తరువాత అంటే.. 1986 జనవరిలో ఈ పక్షి కడప జిల్లా సిద్దవటం రేంజ్ పరిధిలో అట్లూరు మండలం మచ్చాయికుంటలో ప్రత్యక్షమైనట్లు గుర్తించారు. అప్పటి నుంచి ఈ పక్షి కోసం అన్వేషణ సాగిస్తున్నారు. కానీ ఎక్కడా దాని జాడ కనిపించలేదు.

మూడువేల ఎకరాలు స్వాధీనం

కలివికోడి కనిపించిన ప్రదేశానికి సమీపంలో పక్షి ఆవాసం కోసం 2008లో మూడు వేల ఎకరాలు కేటాయించారు. ఆయా భూముల రైతులకు రూ. 28 కోట్లు నష్ట పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించారు. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ ఆధ్వర్యంలో కలివికోడి ఉనికిని కనుగొనేందుకు 2013లో అట్లూరు మండలం కొండూరు దగ్గర ఒక పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆ పక్షి ఉనికిని కనుగొనేందుకు ప్రయత్నించారు. కేంద్ర ప్రభుత్వం 2019లో కలివికోడి పునర్జీవ ప్రాజెక్టును మంజూరు చేసి రూ. 5.73 కోట్లు కేటాయించింది.

ఎదురుచూపులు

దశాబ్దాలుగా కలివికోడి ఉనికిని కనుగొనేందుకు లంకమల్ల అభయారణ్యంలో డబ్ల్యూఐఐ అండ్ ఎస్‌సీఎఫ్ సంయుక్తంగా అధునాతన కెమెరాలను స్థానిక రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో అమర్చుతున్నారు. ఇప్పుడైనా కలివికోడి కనిపించక పోదా అని శాస్త్రవేత్తలు, అధికారులు ఎదురుచూస్తున్నారు.

60 కెమెరాలు అమర్చాం



కలివికోడి ఉనికి కనుగొనేందుకు బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్తలతో కలసి కలివికోడి కనిపించిన ప్రదేశంలో 60 కెమెరాలు అమర్చాం. అలాగే సోమశిల ముంపు ప్రాంతంలో కూడా కెమెరాలు అమర్చే ఆలోచనలో ఉన్నాం.

–కళావతి, రేంజ్ అధికారి, సిద్దవటం అటవీ కార్యాలయం

అవగాహన రాహిత్యంతోనే 'వరద' విమర్శలు

- నిబంధనల ప్రకారమే ఎంఐజీ లేఅవుట్ నిర్మాణం
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను తొలగించలేదని ఫొటో చూపుతున్న రాచమల్లు

ప్రొద్దుటూరు : అవగాహన రాహిత్యంతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జగన్ ప్రభుత్వంపైన, తనపైన విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవాచేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆదివారం రాచమల్లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించిన కడ్డీలను, మట్టిని అమ్ముకున్నామని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారని తెలిపారు.

వైఎస్ హయాంలో భూ సేకరణ

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో అపెరల్ పార్కు నిర్మాణం కోసం సుమారు 80 ఎకరాల భూమిని సేకరించారని రాచమల్లు తెలిపారు. అప్పుడు అపెరల్ పార్కు నిర్మించకుండా వరదరాజులరెడ్డి ఇదే స్థలాన్ని టిడ్కో ఇళ్లకు కేటాయింపజేశారన్నారు. ఐదేళ్లలో 108 ఇళ్లు మాత్రమే నిర్మించారని, అవి నేటికీ పూర్తి కాలేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలను గుర్తించి మీనాపురం, రామేశ్వరం, బొల్లవరం ప్రాంతాల్లో 500 ఎకరాల భూమిని సేకరించి ఇళ్లను నిర్మించామని గుర్తు చేశారు. మధ్య తరగతి వర్గాల కోసం కడప అర్బన్ డెవలప్‌మెంట్ ద్వారా టిడ్కో ఇళ్లకు కేటాయించిన 28 ఎకరాల స్థలంలో ప్లాట్లను అమ్మడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పునాది దశలో ఉన్న టిడ్కో ఇళ్లను ప్రభుత్వమే కాంట్రాక్టర్ ద్వారా తొలగించి ఆ స్థలంలో కొత్త వాటిని నిర్మిస్తోందన్నారు. ఈ పనులు చేపట్టేందుకు రూ. 20 కోట్లతో టెండర్ వేశామని, ఈ టెండర్‌లో వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి పార్టనర్స్ కూడా పాల్గొన్నారని తెలిపారు. కాంట్రాక్టర్ టిడ్కో ఇళ్ల పునాదులను తొలగించి స్టీల్‌ను కొనడం జరిగిందన్నారు. వాస్తవానికి 500 టన్నుల స్టీల్ రావాల్సి ఉండగా కాంట్రాక్టర్‌కు 350 టన్నులు మాత్రమే వచ్చిందని, తనకు జరిగిన నష్టంపై కాంట్రాక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. ఎంఐజీ లేఅవుట్‌లో సిమెంటు రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, పైపులైన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కాంట్రాక్టర్‌ను బెదిరించి పనులు చేయకుండా అడ్డుకున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, సత్యం, జయంతి, లావణ్య, వెంకటసుబ్బారెడ్డి, నూకా నాగేంద్రరెడ్డి, అంజి పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీని ప్రారంభిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు



చాపాడు: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



బద్వేలు అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : సమన్వయంతో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రి, చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనలో భాగంగా ఏపీ ప్రభుత్వం 'హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన ఉండాలన్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రి నుంచి గవిని సర్కిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ నాగేంద్ర, డాక్టర్ కవిత, డీపీఎంఓ శివశంకరయ్య, ఏఆర్టీ సిబ్బంది సాదిక్‌బాషా, గోవిందరెడ్డి, కౌన్సిలర్లు రేవతికుమార్, చంద్రలీల, శ్రీరాములు, చైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాజెక్ట్ సిబ్బంది పుల్లయ్య, ప్రతిమ పాల్గొన్నారు.

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో..

సిర్డ్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రాస్త్రినగర్‌లో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బద్వేలి శివప్రసాద్‌రెడ్డి ఎయిడ్స్ వ్యాధి నివారణ చర్యలు, అది ఎలా వ్యాపిస్తుంది అనే అంశాలను వివరించారు. డీపీఎంఓ శివశంకరయ్య, మాధవరెడ్డి, సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు రూరల్ : ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కామనూరు, గోపవరం, చౌటపల్లె, బొజ్జవారిపల్లె గ్రామ పంచాయతీల్లో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్‌ఓ నరసింహా, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బయ్య, లక్ష్మణ్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి విజయ కుమార్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఆరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, మనం పోరాడాల్సింది వ్యాధితో కానీ రోగితో కాదని తెలిపారు. కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ దావీద్, సలీం పాల్గొన్నారు.

అవగాహనతో ఆరోగ్యంగా జీవించండి

మైదుకూరు : హెచ్‌ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్ అన్నారు. ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మైదుకూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఐసీటీసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

పోరుమామిళ్ల: ఎయిడ్స్‌ను నిర్మూలిద్దామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

ర్యాలీ

స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ జయరాములు, డాక్టర్ కరిష్మా, ఆరోగ్య విద్యాధికారి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేద్దాం

చాపాడు: ఎయిడ్స్/హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేద్దామని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిప్తూ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డా.శ్రీవాణి, సీహెచ్‌ఓ మహదేవయ్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, ప్రసాద్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓ మురళీకృష్ణ, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి

ప్రొద్దుటూరు : పేద విద్యార్థులు చదువుకొనేందుకు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. రెడ్ల సేవా సంఘం వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ చదివే విద్యార్థులకు రూ.20వేలు, బీటెక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.10వేలు చొప్పున 54 మంది విద్యార్థులకు రూ.7.65 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.నాగదస్తగిరెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల సేవా సంఘం ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సంఘం సభ్యులందరూ ఇందు కోసం శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ల కల్యాణ మండపం దాతలను, అధ్యక్షుడు నాగదస్తగిరిరెడ్డిని శాలువాలు కప్పి, మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ వైవీ రామమునిరెడ్డి, డి.రామిరెడ్డి, డిప్యూటీ డీఈఓ జి.రాజగోపాల్‌రెడ్డి, రెడ్ల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, గంగిరెడ్డి మాధవరెడ్డి, అట్లా నరసింహారెడ్డి, మురుకూటి సూర్యనారాయణరెడ్డి, అన్నవరం రామమోహన్‌రెడ్డి, మేరువ లక్ష్మిరెడ్డి, లక్కిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డీఎస్పీ భక్తవత్సలం పేర్కొన్నారు. స్థానిక వన్ టౌన్‌లోని షాదీ ఖానాలో ఆదివారం సద్భావనా సేవాసంఘం, మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. డాక్టర్లు లోకేష్‌కుమార్, శృతి, తోట శ్రీకాంత్, షమనాజ్ రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సద్భావనా సేవా సంఘం వ్యవస్థాపకుడు సుభహాన్, గౌరవాధ్యక్షుడు పుల్లారెడ్డి, అధ్యక్షుడు అల్లాబకాష్, ఉపాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మన ప్రజాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయాబ్‌ఖాన్, కింగ్‌బాషా పాల్గొన్నారు.

భూమికి జీవం.. జీవామృతం



జీవామృతం తయారు చేస్తున్న మాస్టర్ శ్యాం, రైతులు

ప్రొద్దుటూరు రూరల్ : భూమికి జీవం పోయాలంటే జీవామృతం పారించాల్సిందేనని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ శ్యాం పేర్కొన్నారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో మహిళా రైతు మౌనిక పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆదివారం పరిశీలించి మరిన్ని అంశాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకుని గ్రామంలో ఆదర్శ మహిళా రైతుగా ఉన్నారన్నారు. ఏ పంటలకైనా జీవామృతం పిచికారి, నీటి కాలువ ద్వారా పారించడం ద్వారా భూమిలో ఉన్న సూక్ష్మపోషకాలు పెరిగి మొక్కకు బాగా అందుతాయన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసి భూమి సారవంతం చేయాలని పేర్కొన్నారు. రాబోయే కాలంలో భూమిని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి ఆరోగ్యంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ మాధవి, రైతులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి – ఆందోళనలో రైతులు



నేలమట్టమైన వరి పంట

ప్రొద్దుటూరు రూరల్ : రెండు రోజులుగా తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు మండలంలో అక్కడక్కడ పండిన వరి పంట నెలకొరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట పడిపోవం వలన పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు నూర్పిళ్ల ఖర్చులు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారు 3,700 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఎన్‌డీఎల్, జిలకర్ర మసూర, ఎర్ర జగిత్యాల, తెల్ల జగిత్యాల వంటి రకాల వరి పంటలను రైతులు సాగు చేశారు. చౌడూరు, శంకరాపురం, దొరసానిపల్లె, కొత్తపేట, పెద్దశెట్టిపల్లె గ్రామాల్లో ఇప్పటికే వరి పంట నూర్పిళ్లు ముగిశాయి. కామనూరు, కల్లూరు, తాళ్లమాపురం, సగిలిగొడ్డుపల్లె, కానపల్లె తదితర గ్రామాల పరిధిలో ప్రస్తుతం వరి కోత నూర్పిళ్లు జరగాల్సి ఉండగా తుపాను కారణంగా రైతులు నిలిపివేశారు. కేసీ కెనాల్ ఆరో నంబర్ కాలువ కింద ఎక్కువ విస్తీర్ణంలో ప్రొద్దుటూరు మండలానికి చెందిన రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ కేసీ కెనాల్ పరిధిలోని భూముల్లో అక్కడక్కడ వరి పంట గాలికి నేలమట్టమైంది.

శిల్పారామంలో ముందస్తు క్రిస్మస్ సందడి

కడప కల్చరల్ : శిల్పారామంలో ముందస్తు క్రిస్మస్ సందడి కనిపించింది. ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ఎప్పటిలా సంప్రదాయ వేదికపై ప్రదర్శించే నృత్యాలకు బదులు ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. పలు క్రైస్తవ, ఔత్సాహిక యువ సంఘాల ప్రతినిధులు ప్రాంగణంలో పెద్ద స్టార్‌ను విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసి వెలిగించారు. దాని చుట్టూ క్రిస్మస్ ట్రీ కటౌట్లు ఉంచారు. వేదికపై క్రిస్మస్ తాత వేష ధారులు పిల్లలతో ఆడిపాడి అలరించారు. చిన్నారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆయన చిన్నారులకు చాకెట్లను పంచిపెట్టి హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ చెబుతూ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పట్టణవాసులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

గోపవరం : వరిపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం వలన ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించుకోవచ్చని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని రాచాయపేటలో రబీలో సాగు చేస్తున్న వరిపంటకు సంబంధించి నారుమళ్లను ఆయన పరిశీలించారు. నాటు వేసే ముందు నారు కొనలు తుంచి నాటడం మంచి పద్ధతి అని, తద్వారా కాండం తొలుచు పురుగును నివారించుకోవచ్చని పేర్కొన్నారు. దోమపోటు నివారణకు కాలిబాటలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు విస్తీర్ణం వదలి కాలిబాటలు తీయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో నారు శుద్ధిని బీజామృతంతో చేసుకోవాలని ఆయన సూచించారు.

పసికందుకు అరుదైన చికిత్స



ఐసీయూలో కోలుకుంటున్న పసికందు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఇటీవల నూతనంగా ప్రారంభించిన వారాహి సూపర్ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆసుపత్రిలో డాక్టర్ లోకేష్, డాక్టర్ శృతి మూడు నెలల పసికందుకు అరుదైన చికిత్స చేసి ప్రాణం పోశారు. నంద్యాల జిల్లాలోని చాగలమర్రికి చెందిన విజయలక్ష్మి దంపతులకు జన్మించిన 3 నెలల పసికందుకు ఆరోగ్యం బాగలేకపోవడంతో వారాహి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పసికందుకు నాలుగు రోజుల నుంచి దగ్గు, జలుబు, జ్వరం వస్తూ జబ్బు ముదిరి శ్వాస తీసుకోవడానికి కూడా కష్టతరమైన పరిస్థితిల్లో కార్డియాక్ అరెస్ట్ (గుండె ఆగుట) జరిగింది. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వెంటనే పసికందుకు త్రీ సైకిల్స్ ఆఫ్ సీపీఆర్ చేసి గుండె మళ్లీ పని చేయడం కోసం మందులను సెంట్రల్ లైన్ ద్వారా ఇవ్వడంతో పసికందు గుండె మామూలు స్థితిలో పని చేయడం ప్రారంభించింది. తర్వాత పసికందుకు అన్ని పరీక్షలు చేయగా సెవెర్ పల్మనరీ హైపర్‌టెన్షన్, సెవర్ ఆర్ప్స్, సుప్ర వెంట్రికూలర్ టాకీ కార్డియా అనే క్రిటికల్ పరిస్థితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. నాలుగు రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి సెంట్రల్ లైన్ ద్వారా మందులు అందించడంతో పసికందు పూర్తిగా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు.

నేడు గుడి తిరునాల



ముస్తాబైన పరిపేతురు పరిపాలు చర్చి

కలసపాడు: కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిపేతురు పరిపాలు చర్చి 137వ వార్షికోత్సవం సోమ, మంగళవారాల్లో నిర్వహిస్తున్నట్లు డీనరీ చైర్మన్ ఆనందకుమార్, ప్రెస్బేటర్ ఆసిస్‌గాబ్రియేల్‌లు తెలిపారు. 2వ తేదీ సోమవారం సాయంత్రం ఊరేగింపు, రాత్రి 6–30 గంటలకు క్రైస్తవ సంగీత విభావరి, 7 గంటలకు పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, 8–30 గంటలకు దీపారాధన, 9–30 గంటలకు కానుకలు సమర్పించుట, రాత్రి 10 గంటలకు యువజనులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 10–30 గంటలకు హంస అవార్డు గ్రహీత పుల్లయ్య బృందం వారిచే చెక్కభజన, 11–30 గంటలకు జీవన్‌కుమార్ విజయవాడ వారిచే ధనవంతుడు–లాజరు క్రైస్తవ నాటకం ఉంటుందని డీనరీ చైర్మన్ ఆనందకుమార్ తెలిపారు. 3 వ తేదీన ఉదయం 4 గంటలకు మొదటి ఆరాధన, ప్రభురాత్రి భోజన సంస్కారం, 7 గంటలకు గుడిప్రదర్శన, 9 గంటలకు బాప్తిస్మములు, సాయంత్రం 4 గంటలకు ప్రతిష్ట పండుగ ప్రార్థన కార్యక్రమాలు ఉంటా యన్నారు. వార్షికోత్సవం సందర్భంగా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, స్థానిక ఎస్ఐ చిరంజీవి బందోబస్తు నిర్వహించనున్నారు.

సబ్ రిజిస్ట్రార్‌తో సహా ఆరుగురిపై కేసు

బద్వేలు అర్బన్ : అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్‌తో సహా ఆరుగురిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నంపల్లె రెవెన్యూ గ్రామ పొలం సర్వే నంబర్ 1754/2లో తమ భూమిని బద్వేలు మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్నారంటూ సుశీల అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్ రామలక్షుమ్మ, గోపాలస్వామి, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.